# వైఎస్ఆర్-అన్నమయ్య వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

బుధవారం 11 జూన్ 2025


## కలెక్టర్ చేతుల మీదుగా ప్రతిభా అవార్డులు.

**చిట్వేలి, జూన్ 10, ప్రభాతవార్త:**

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ చేతుల మీదుగా ప్రతిభ అవార్డులను అందుకోవడం గర్వంగా ఉందని శ్రీ సాయి వికాస్ పాఠశాల 10 వ తరగతి విద్యార్థులు యు జోశ్విత, ఎస్ మస్తాన్, బి ప్రణవి, ఆర్ ప్రణవి, జె లిఖితలు అన్నారు. మంగళవారం అవార్డులు పొందిన విద్యార్థులు మాట్లాడుతూ తమ విద్యా ప్రగతికి తోడ్పాటు అందించిన కరస్పాండెంట్ తిరుమల రెడ్డయ్యకు, ఉపాధ్యాయ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. తమ తల్లిదండ్రులతో కలసి ఈ అవార్డును తీసుకోవడం మిక్కిలి సంతోషం నిలిపిందని, వారి ఆశయాలు కనుగుణంగా ఉన్నత లక్ష్యాలను చేరుకుంటామని అవార్డు గ్రహీతలు తెలియపరిచారు.




## శ్రీరామ అలంకారంలో శ్రీ వేంకటేశ్వరుడు.

**చిట్వేలి, జూన్ 10,ప్రభాతవార్త:**



మండల పరిధిలోని కే ఎస్ అగ్రహారం శ్రీ భూనీళా సమేత వెంకటేశ్వర స్వామి ఆలయం నందు వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగ రోజు మంగళవారం స్వామివారు శ్రీరామ అవతారంలో హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు స్వామి వారినీ ముగ్ధ మనోహరంగా అలంకరించారు. త్రేతా యుగంలో మనుష్య రూపంలో జన్మించి, పితృ వాక్య దక్షుడిగా, ఏకపత్నివృతుడిగా, సుభిక్ష పాలకుడిగా శ్రీరాముడి చరిత మనందరికీ ఎప్పటికీ శిరోధార్యమని అర్చకులు సతీష్ శర్మ తెలిపారు.శ్రీ వెంకటేశ్వర స్వామి తొలి అడుగు కడప లోను, మలి అడుగు కే ఎస్ అగ్రహారం నందు మోపి తిరుమల కు చేరుకున్నట్లు ప్రతీతి.కాగా ఇచట స్వామి వారు తిరుమల మూల విగ్రహ రూపంలో భక్తులకు దర్శనం ఇవ్వడం విశేషం. మట్లి రాజుల కాలంలో నిర్మితమై పురాతన ప్రాశస్తం ఉన్న ఈ ఆలయం నందు ప్రతి ఏడాది వార్షిక బ్రహ్మోత్సవాలను పది రోజులు పాటు వివిధ అలంకారాలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించడం ఈ ఆలయ గొప్పతనం.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం - మంత్రి

**రాజంపేట అర్బన్, జూన్ 10 ప్రబాతవార్త :**

రైతుల అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తూ, పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఖరీఫ్ 2025 సీజన్‌కు సంబంధించి మంగళవారం ఉదయం సంబేపల్లి మండలంలోని నారాయణరెడ్డిగారి పల్లె రైతుసేవా కేంద్రంలో రెండు కీలక కార్యక్రమాలను మంత్రి ప్రారంభించారు. మొదటిగా, రైతులకు సబ్సిడీపై వేరుశనగ విత్తన బస్తాల పంపిణీ చేపట్టారు. ఒక్కో 30 కేజీల విత్తన బస్తా ధర రూ.2850 కాగా, ప్రభుత్వం రూ.1140 రాయితీగా ఇవ్వడంతో రైతులు కేవలం రూ.1710 మాత్రమే చెల్లించి పొందే వీలుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.అంతేగాక, వ్యవసాయ యంత్ర పరికరాల బ్యాంకుల అభివృద్ధిని లక్ష్యంగా ప్రభుత్వం 80 శాతం రాయితీతో కిసాన్ డ్రోన్లను అందిస్తున్నదని మంత్రి వెల్లడించారు. ఈ సందర్భంగా కిసాన్ డ్రోన్ల పంపిణీ కార్యక్రమాన్ని కూడా ఆయన ప్రారంభించారు. ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా వ్యవసాయ పనుల్లో సమయాన్ని, ఖర్చులను తగ్గించుకోవచ్చని చెప్పారు.ఈ రెండు కార్యక్రమాల్లో వ్యవసాయ శాఖ అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వం నుంచి మరిన్ని రాయితీ పథకాలూ, ఆధునిక పరికరాలూ త్వరలో అందుబాటులోకి రానున్నాయని మంత్రి హామీ ఇచ్చారు.



## ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేయాలి

**చిన్నమండెం జూన్ 10 ప్రబాతవార్త:**



మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మండలంలోని వారి స్వగ్రామంలో మంగళవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. పలువురు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, వారి విన్నపాలను సావధానంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపించారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజల అభ్యర్థనలపై శీఘ్ర చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని ఆయన ఆదేశించారు. మంత్రివర్యుల స్పందన పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, ఆయన ప్రజల పట్ల చూపుతున్న దృఢనిశ్చయాన్ని, ప్రజాభిమానాన్ని కొనియాడారు. ప్రజల మద్దతుతో నడిచే మంత్రి పాలన ప్రజల ఆశలను నెరవేర్చుతుందనే నమ్మకాన్ని వారు వ్యక్తం చేశారు.

## ప్రపంచ ఆహార కార్యక్రమ బృందం పర్యటన



**చిన్నమండెం జూన్ 10 ప్రబాతవార్త :**

ప్రపంచ ఆహార కార్యక్రమం ప్రతినిధుల బృందం మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జిల్లా పర్యటనలో భాగంగా చిన్నమండెంలో పర్యతించారు. ఈ బృందంలో ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీ బాలాజీ త్రిపాఠి, ప్రోగ్రామ్ అసోసియేట్ కృష్ణ మూర్తి, సౌమ్య, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వెంకట మోహన్ ఉన్నారు. ఈ పర్యటనలో వాతావరణ మార్పుల ప్రభావాన్ని సమగ్రంగా అధ్యయనం చేయడం, అలాగే ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అమలవుతున్న ప్రాంతాల్లో పరిశీలన చేయడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. బృందం జిల్లా కలెక్టర్‌ని మర్యాదపూర్వకంగా కలుసుకొని పర్యటన ఉద్దేశ్యాన్ని తెలియజేశారు. పర్యటనలో భాగంగా చిన్నమండెం మండలంలోని రైతు శాస్త్ర కేంద్రంను సందర్శించిన బృందం, అక్కడ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో ప్రత్యక్షంగా సంభాషించారు. వాతావరణ మార్పుల ప్రభావం, పంటల దిగుబడి, ఆహార భద్రత, మరియు వ్యవసాయ జీవనవిధానాలపై ఈ మార్పుల ప్రభావం గురించి రైతుల అభిప్రాయాలు సేకరించారు. ఈ పర్యటన అనంతరం వాతావరణ మార్పులకు అనుగుణంగా ప్రకృతి వ్యవసాయాన్ని మరింత మెరుగుపరచేందుకు అవసరమైన మార్గదర్శకాలు, ప్రభుత్వం తీసుకోవలసిన సహాయ చర్యలపై ఒక సమగ్ర నివేదికను WFP సిద్ధం చేయనుంది.

# అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణం...

### అధ్యయనానికి నిపుణుల కమిటీ... రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ

### 6 మందితో కమిటీ ఏర్పాటు

**రాజంపేట అర్బన్, జూన్ 10, ప్రభాతవార్త:**

అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. గత నెల 29న మహానాడులో వరదల్లో కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటన చేసిన విశయం తెలసిందే. అన్నమయ్య ప్రాజెక్టును పునర్నిర్మించే బాధ్యత ప్రభుత్వమే తీసుకుంటుందని సీఎం ప్రకటించారు. ఈ మేరకు జలవనరుల శాఖలో కదలిక వచ్చింది. ముఖ్యమంత్రి ప్రకటించిన 24గంటలలోపే అన్నమయ్య ప్రాజెక్టు సంబంధించిన పూర్తి సమాచారాన్ని జలవనరుల శాఖ ఇంజనీరింగ్ చీఫ్ కార్యలయం తెప్పించుకుంది. అంతకుముందే కేంద్ర జలసంఘం ఆదేశాల మేరకు 8.23లక్షల క్యూసెక్కుల వరద నీటి విడుదల సామర్థ్యంతో ప్రాజెక్టును నిర్మించేందుకు అధికారులు ప్రస్తుతం ఉన్న 5గేట్లతో పాటు అదనంగా మరో 16గేట్లు ఏర్పాటుచేసి కాంక్రీట్ డ్యాం నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. అలాగే ప్రత్యామ్నాయంగా మరొక డిజైన్‌ను రాక్‌ఫిల్ డ్యాం నిర్మించి ప్రస్తుతం ఎడమ వైపున ఉన్న స్కిల్‌వే లాగానే కుడివైపున కూడ కొండ ప్రక్కనే నదిలో మరో స్పిల్‌వే నిర్మించి అవసరమైన గేట్లు ఏర్పాటుచేయాలని డిజైన్లను రూపొందించింది. అయితే ఈ రకమైన కొండల డిజైన్‌లను కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తరువాత జిల్లా జలవనరుల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. అంతే కాకుండా ప్రాజెక్ట్ పునర్నిర్మాణం పనులు చేపట్టేందుకు నిపుణుల కమిటీని నియమించి వారి సిఫార్సుల మేరకు ప్రాజెక్టును నిర్మించాలని కూడ నివేదిక పంపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం సాంకేతిక నిపుణుల కమిటీని నియమిస్తూ జీవో ఆర్టీ నెంబర్ 283 జారీ చేసింది. జలవనరుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ప్రాజెక్టుల డిజైన్ నిపుణుడు చీఫ్ ఇంజనీర్ రమేష్‌కుమార్, హైడ్రో మెకానికల్ ఎక్స్‌పర్ట్ కే.సత్యనారాయణ, జియాలజిస్ట్ విశ్రాంత డీజీ ఎం.రాజు, సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజనీర్, హైడ్రాలజీ ఎక్స్‌పర్ట్ చీఫ్ ఇంజనీర్‌ను అలాగే సాంకేతిక నిపుణుల కమిటీ కన్వీనర్‌గా కడప జిల్లా ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్‌ను నియమించారు. ఈ సాంకేతిక నిపుణుల కమిటీ అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధ్యాయనం చేస్తుంది. సమగ్ర విశ్లేషణ తర్వాత సాంకేతిక నిపుణుల కమిటీ ప్రభుత్వానికి నివేదిక అందజేయాల్సి ఉంది. ఈ కమిటీ సిఫార్సుల మేరకే ప్రాజెక్టును పునర్నిర్మాణం చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రభుత్వం నిర్దేశిస్తుంది. గతంలో 787కోట్లతో ప్రాజెక్టు అంచనా వ్యయంగా పేర్కొని టెండర్లు పిలిచారు. అయితే నిపుణుల కమిటీ నివేదిక వచ్చిన తర్వాత పాత గుత్తేదారునే కొనసాగిస్తారా లేక మరళా టెండర్లు పిలుస్తారా అన్నది ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. త్వరలోనే నిపుణుల కమిటీ అన్నమయ్య ప్రాజెక్టును పరిశీలిస్తుందని జలవనరుల శాఖ అధికారిక వర్గాల సమాచారం అందింది.



నిపుణుల కమిటీ నివేదిక పైనే అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణం భవిష్యత్తు

## స్మశానం ఆక్రమించిన వారిని ఖాళీ చేపించండి..

### స్మశానం భూమిని పరిశీలించిన ఆర్‌డిఓ చంద్రమోహన్

**బ్రహ్మంగారి మఠం జూన్ 10 ప్రభాతవార్త :**

బ్రహ్మంగారిమఠం మండలం కేంద్రంలోని ఉన్న 10.5 ఎకరాల స్మశానం లో ఆక్రమించుకున్న వారిని వెంటనే ఖాళీ చేపించి చుట్టూ కొలతలు వేసి ప్రభుత్వ అధీనంలోకి తీసుకోవాలని తహసీల్దార్ కు బద్వేల్ ఆర్ డి ఒ చంద్ర మోహన్. వివరాలలోకి వెళితే బ్రహ్మంగారి మఠం లోని అన్ని కులాలకు కలిపి ప్రభుత్వం వారు దాదాపు 40 సంవత్సరాల మునుపే స్మశానం కోసం 10.5 ఎకరాల భూమిని ఏర్పాటు చేసింది అయితే రాను రాను భూముల రెట్లు పెరగటంతో కొందరి కబ్జా రాయుళ్ళ కన్నుపడి ఆక్రమించుకొని చుట్టూ కంచ ఏర్పాటు చేసుకొని వ్యవసాయం చేయడం మొదలు పెట్టారు.

### ఫలించిన గ్రామస్తుల కల

స్మశానంను ఆక్రమించుకున్న వారిని ఖాళీ చెపించడం కోసం కందిమల్లాయపల్లె గ్రామస్తులు కుల మతాలకు అతీతంగా కొన్ని సంవత్సరాల నుండి పోరాటం చేసి, కోర్టుల నుండి అనుమతులు తెచ్చినా కూడా, రాజకీయంగా బలంగా ఉన్న ఆక్రమిత దారులు, డబ్బు బలంతో, రాజకీయ బలంతో,అధికారులను బెదిరిస్తూ వచ్చారు, చివరకు సమస్య తారా స్థాయి కి చేరడంతో బద్వేల్ ఆర్ డి ఒ చంద్ర మోహన్ వచ్చి స్మశాన భూమిని పరిశీలించి, ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని మండల అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.



## రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల కల !!

### నేడు సంపర్క్ క్రాంతి ఎక్ప్రెస్ రైలుకు మంత్రి పచ్చ జెండా

**రాజంపేట అర్బన్, జూన్ 10 ప్రబాతవార్త :**

రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రం ప్రజల కల 20 సంవత్సరాల తర్వాత సహకారం అవుతోంది. 2005 జూలై 6న తిరుపతి నుంచి న్యూఢిల్లీకి సంపత్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభమైంది. అప్పటినుంచి ఎన్నోసార్లు రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలు రాజంపేటలో ఆపాలని ప్రజలు కోరుతున్నా పార్లమెంట్ సభ్యులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఇన్నాళ్లకు ప్రజల కల సహకారం అవుతోంది. బుధవారం రైలు నెంబరు 12707 తిరుపతిహజరత్ నిజాముద్దీన్ ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలుకు రాజంపేట స్టేషన్లో అదనపు స్టాపేజి ఏర్పాటును రాష్ట్ర రవాణా యువజన మరియు క్రీడా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించనున్నారు. ఉదయం 6.00 గంటలకు రాజంపేట రైల్వే స్టేషన్ వద్ద దక్షిణ మధ్య రైల్వే అధికారులతో కలిసి మంత్రి రైలు అదనపు స్టాపేజి ఏర్పాటు సౌకర్యాన్ని ప్రారంభిస్తారు. దేశ రాజధానికి రాజంపేటలో రైలు స్టార్టింగ్ ఇవ్వడం పట్ల రాజంపేట ప్రాంత ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతోంది.




## అన్నమయ్య జిల్లాలో విషాదం

**రాజంపేట అర్బన్, జూన్ 10 ప్రబాతవార్త :**

మదనపల్లెలో గఫూర్, హసీనా దంపతుల కుమార్తె మస్తానీ (16) ఎనిమిదో తరగతి వరకు చదువుకుని ఇంటి వద్దే ఉంటోంది. తల్లి హసీనా పనులకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చేసరికి, మస్తానీ ఫోన్ మాట్లాడుతుండటం గమనించింది. దీంతో ఆమె కుమార్తెను మందలించింది.తల్లి మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన మస్తానీ, తాను వేసుకున్న చున్నీతో బాత్రూంలోకి వెళ్లి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది.

## ఆర్టీసీ బస్టాండులోని కూల్ డ్రింక్ షాపులో చోరీ

**బద్వేలు,జూన్ 10 ప్రభాతవార్త**



బద్వేల్ ఆర్టీసీ బస్టాండ్ బస్సులు బయటకు వెళ్లే దారిలో ఉన్న కూల్ డ్రింక్ షాప్‌లో మంగళవారం దొంగతనం జరిగింది. ఈ చోరీలో భాగంగా షాపు పైన ఉన్నటువంటి రేకులు తొలగించి షాప్ లో క్యాష్ కౌంటర్ లోని 15వేల రూపాయల నగదు, 40 వేల రూపాయల సామగ్రిని దుండగులు దోచుకెళ్ళినట్లు షాపు యజమాని తెలిపారు. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండి ,రాత్రి సమయంలో పోలీస్ పెట్రోలింగ్ ఉన్నా కూడా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో చోరీ జరగడం పట్ల ఇది లోకల్ దొంగల పనే అని అంటున్న స్థానికులు పేర్కొంటున్నారు.






# క్రమశిక్షణ, సేవా భావానికి ప్రతీక స్కాట్

**రాజంపేట అర్బన్, జూన్ 10 ప్రబాతవార్త :**

క్రమశిక్షణ, సేవా భావానికి ప్రతీక స్కాట్ అని,స్కాట్ శిక్షణతో బంగారు భవిష్యత్తు ఉంటుందని జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి అన్నారు. విద్యార్థులునాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు.మంగళవారం రాజంపేట పట్టణం బాలికోన్నత పాఠశాలలో గైడ్ విద్యార్థినులకు ఈనెల 6వ తేదీ నుండి 10వ తేదీ వరకు 5 రోజులుగా నిర్వహిస్తున్న తృతీయ సోపాన్, రాజ్య పురస్కార్ శిక్షణ ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ విద్యార్థులలో చిన్ననాటి నుండే క్రమశిక్షణతో పాటు దేశభక్తి, సామాజిక సేవా భావాలను పెంపొందించడానికి బాలభటుల ఉద్యమం తోడ్పడుతుందని అన్నారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులలో క్రమశిక్షణ, దేశభక్తి, నిజాయితీ, సుగుణ శీలత, ధైర్య సాహసాలు, సేవాగుణం లాంటి ఉత్తమ పౌరసత్వ లక్షణాలు విద్యార్థుల్లో పెంపొందుతాయన్నారు. స్కౌటిజం ద్వారా మెరుగైన సమాజం ఏర్పడుతుందన్నారు. స్కాట్ శిక్షణ పొంది సర్టిఫికెట్లు కల విద్యార్థులకు విద్యా ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్ సౌకర్యం కలదన్నారు. అందుకే విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్ మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమానికి తృతీయ సోపాన్ శిక్షణకు 92 మంది, రాజ్య పురస్కార్ శిక్షణకు 12 మంది గైడ్స్ విద్యార్థులు హాజరు కావడం జరిగిందన్నారు. ముఖ్యంగా పకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఏ విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి, నైతిక విలువలు, మానవతా విలువలు, దేశభక్తి, సేవా భావం వంటి అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. రోడ్డు ప్రమాదాల జరిగినప్పుడు ప్రథమ చికిత్స అందించి సమీపంలోని ఆసుపత్రికి చేర్చడం, గ్రామాల్లో జరిగే వివిధ కార్యక్రమాల సమయంలో స్వచ్ఛందంగా సేవలందించడం, మంచి అలవాట్ల గురించి నేర్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి, గైడ్స్ లీడర్ ట్రైనర్ శకుంతల, హెచ్ డబ్ల్యు బి నిర్మల, అడ్వాన్స్ గైడ్ కెప్టెన్లు శివలీల, కనకదుర్గ, సుజాత, బేసిక్ గైడ్ కెప్టెన్లు గోవిందమ్మ, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.



## మోడల్ పాఠశాలలో సామర్ధ్య పరీక్ష



ముద్దనూరు, జూన్ 10, ప్రభాతవార్త:
మోడల్ ఫౌండేషన్ పాఠశాలలో ప్రవేశం కొరకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సంజీవప్ప ఆధ్వర్యంలో మంగళవారం నాడు మండల పరిధిలోని ఉప్పులూరు గ్రామంలో మోడల్ పాఠశాలలో ఒకటవ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు సామర్థ్య పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులను పాఠశాలలో చేర్చుకున్నట్లు వివరించారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తే వారికి మౌలిక సదుపాయాలతో పాటు బుక్స్, యూనిఫామ్ వంటి తదితర అనేక ప్రయోజనాలు సమకూరి ఉన్నతమైన విద్య లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ కిరణ్ మరియు ఉపాధ్యాయులు, సోమేశ్వరరెడ్డి, రామకేశవ, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 155 మందికి ఉచిత కంటి పరీక్షలు



(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త )
అడాప్ట్ ఎ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ అమెరికా. ఫౌండర్ చైర్మన్ భూపతీ రాజు పడేంటి వారి సహకారం తో ఉచిత ఐ క్యాంపు ఒంటిమిట్ట మండలం రాచపల్లిలో మంగళవారం తిరుపతి లోని ప్రముఖ వాసన్ ఐ కేర్ హాస్పిటల్ చే నిర్వహించారు. ఈ శిబిరంలో 155 మందికి కంటి పరీక్షలు చేశారు. అంతకు ముందుగా ఆదివారము, సోమవారము అన్నమయ్య జిల్లా రాజంపేట మండలంలోని మదన గోపాలపురం, తాళ్లపాకల్లో ఈ కంటి వైద్య శిబిరాలు నిర్వహించి 300 మందికి పరీక్షలు జరిపి 50 మందికి పైగా కంటి ఆపరేషన్లకు సిద్ధం చేశారు. కడప జిల్లా ఇంచార్జ్, శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ కొండూరు శరత్ కుమార్ రాజు, లైషన్ ఆఫీసర్స్ ఆర్లగడ్డ అంజనరాజు, సంగరాజు శివరామరాజు, కోనేటిరవిరాజు మరియు వాసన్ ఐ కేర్ హాస్పిటల్ డాక్టర్ వెంకటేష్, టెక్నీషియన్స్ గిరిప్రసాద్, మంజునాథ్ మరియు గ్రామ పెద్దలు శంకర్ రాజు,సుబ్బరామరాజు బాలరాజు,చిన్నశేషమరాజు, మోహనరాజు, వెంకటసుబ్బరాజు అంజనమ్మ, ఆదిలక్ష్మమ్మ, రాజేశ్వరి, లక్ష్మమ్మ మరియు గ్రామ సభ్యులు పాల్గొన్నారు.

## జగన్‌రాజు ఆధ్వర్యంలో బాలయ్య జన్మదిన వేడుకలు



రాజంపేట అర్బన్, జూన్ 10 ప్రభాతవార్త :
రాజంపేట టిడిపి కార్యాలయం మంగళవారం హిందూపురం ఎమ్మెల్యే, పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను పార్టీ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజు ఘనంగా నిర్వహించారు.తెలుగు తమ్ముళ్లతో కలిసి కార్యాలయంలో కేక్ జగన్ రాజు కేక్ కట్ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండ్రికి తగ్గ తనయుడుగా తన నటనతో ప్రజలను మెప్పించి పద్మ విభూషణ్ అవార్డు అందుకున్న బాలయ్యకు నియోజకవర్గ ప్రజల తరఫున జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు.భవిష్యత్తులో ఆయన మరింత ఉన్నత స్థితికి ఎదిగి భారతదేశ గర్వించదగ్గ నటుడిగా, నాయకునిగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

లక్కిరెడ్డిపల్లి జూన్ 10 ప్రభాతవార్త
రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో ఉచిత ఆధార్ సేవలు జరుతున్నాయని, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇంచార్జ్ ఎంపిడిఓ ఉషారాణి పేర్కొన్నారు మంగళవారం మండలంలోని లక్కిరెడ్డిపల్లి గ్రామ సచివాలయం 1 నందు 10 తేదీ నుండి 13వ తారీకు వరకు ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు తీసుకోవడంలో చేర్పులు మాకు చేసుకోవడం ఏమో చేయించుకోవాల్సిందిగా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు తీసుకోవడంలో అప్డేట్ చేసుకోవడంలో మార్పులు చేసుకోవాల్సిందిగా తెలియజేయగలరు.

## హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలి

### బహుజనసేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న దృశ్యం

మదనపల్లె, జూన్ 10 ప్రభాతవార్త :
ఎస్సి, ఎస్టి, బిసి హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచి మెరుగైన పౌష్టికాహారాన్ని అందించాలని బహుజనసేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు డిమాండ్ చేశారు. మంగళవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం నందు హాస్టల్ విద్యార్థులకు మెస్‌చార్జీలు పెంచాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సాధారణ ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు మెరుగైన భోజనం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయమై చిత్తూరు ఎమ్మెల్యే గురుజాల జగన్‌మోహన్ గత కలెక్టర్ సమావేశంలో మాట్లాడడం జరిగిందన్నారు. పక్క రాష్ట్ర ప్రభుత్వాలు హాస్టల్ విద్యార్థులకు సన్నబియ్యం అందించి పౌష్టికాహారం ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటుంటే మన రాష్ట్ర ప్రభుత్వం జైలు ఖైదీలు కంటే ఘోరంగా విద్యార్థులకు భోజనాన్ని అందిస్తాందన్నారు. రాబోయే విద్యాసంవత్సరంలోపు కనీసం బియ్యం పంపిణీ విధానాన్ని మార్చి నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. కాస్మోటిక్ చార్జీలను తక్షణం పెంచాలన్నారు. రాష్ట్రంలోని అన్ని బహుజన సంఘాలు ఎస్సి, ఎస్టి, బిసి సంఘాలు డిమాండ్ చేస్తాయని హెచ్చరించారు. సిపిఐ, ఎస్ఎఫ్ఐ రాయలసీమ విద్యార్థిసంఘాల నాయకులు, ఎస్సి, ఎస్టి, బిసి సంఘాల నాయకులు గంటపాటు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దివాకర్, నరసింహులు, సుబ్రమణ్యం, మల్లిక, సిపిఐ మల్లి, మనోహర్‌రెడ్డి, ప్రకాష్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సైనికుని కుమారునికి షైనింగ్ స్టార్స్ అవార్డు

ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 10, ప్రభాత వార్త :
ప్రొద్దుటూరు మాజీ సైనికుని కుమారునికి షైనింగ్ స్టార్స్ 2025 అవార్డు లభించిందని డిఫెన్స్ ఎక్స్ సర్వీస్ మెన్ అసోసియేషన్ ప్రొద్దుటూరు డివిజన్ ప్రెసిడెంట్ నేట్ల బాలవీరా రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన షైనింగ్ స్టార్స్ 2025 కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రమైన కడప నదరంలోని మాదవీ కన్వెన్షన్ సెంటర్ నందు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా మాజీ సైనికుడు డి దస్తగిరి కుమారుడు దూదేకుల వసీమ్ హుస్సేన్ 10వ తరగతిలో మంచి ప్రతిభ కనబరిచిన కారణంగా మెడల్, ప్రశంసా పత్రం మరియు 20 వేల నగదు బహుమతిని అందుకోవడం సంతోషకరమన్నారు.

# ఎర్ర నేలలలో నూనె గింజల సాగు రైతుకు లాభదాయకం

లక్కిరెడ్డిపల్లె; జూన్ 10, ప్రభాత వార్త
ఎర్రనేలలో వేరుసెనగ కాకుండా నూనె గింజల సాగు రైతుకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని శాస్త్రవేత్త సురేష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బి ఎర్రగుడి, కొనంపేట గ్రామాలలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు ఖరీఫ్ సీజన్లో పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త సురేష్ మాట్లాడుతూ వేసవిలో తొలకరి చినుకులలో లోతు దుక్కులు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ ప్రాంతంలో ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్లో రైతులు వేరుశనగ సాగు చేస్తూ ఉంటారని, అలా కాకుండా ఎర్రనేలలో ఆముదం, ప్రొద్దుతిరుగుడు వంటి పంటలు సాగు చేసుకోవడంతో మంచి దిగుబడి సాధించవచ్చునని అన్నారు. అనంతరం ఉద్యానవన కళాశాల అధ్యక్షురాలు ముకుంద లక్ష్మి మాట్లాడుతూ మామిడిలో పంట కోత అనంతరం సస్యరక్షణ చర్యలు చేపడితే రైతులు పంట దిగుబడి అధికంగా పొందవచ్చును అన్నారు. మామిడి లో పిందె దశలోనే రైతులు లింగాకర్షణ బుట్టలను ఏర్పాటు చేసుకోవడంతో పండు ఈగ నుండి బయటపడవచ్చునని ఆమె తెలిపారు. మార్కెట్లో బుట్ట ధర 3.30 రూపాయలు తో అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం ఊట్కూరు డాక్టర్ శిల్పకళా మాట్లాడుతూ డ్రోన్ ధర రైతుకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని ప్రభుత్వం సబ్సిడీ




ద్వారా రైతుకు ఒక్కొక్క డ్రోన్ 2 లక్షల రూపాయలకే అందజేస్తుందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. అనంతరం కె వి కె గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ప్రశాంతి మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘం రైతులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం ఏ పథకం అమలు చేసిన రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారానే ప్రభుత్వ పథకాలు అందజేస్తుందని ఈ విషయాన్ని రైతులు గమనించి ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు అనూష, కేరోలిన్, విహెచ్ఎలు పావని,రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## మహాసభలను జయప్రదం చేయాలి

బద్వేలు అర్బన్ జూన్ 10 ప్రభాతవార్త :
యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర 11వ మహాసభలను ఈనెల 14,15 తేదీలలో గుంటూరులో నిర్వహించనున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగరాజా,గిద్దలూరు వెంకట సుబ్బయ్య, చెన్న క్రిష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం బద్వేలు సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో మహాసభ వాల్ పోస్టర్లను వారు చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ 2007లో అనేక పోరాటాలు చేసి 7200 మంది కాంట్రాక్ట్ కార్మికులను చేయడంలో సిఐటియు కీలకపాత్ర పోషించిందన్నారు. గుంటూరులో నిర్వహించనున్న ఈ మహాసభలో విద్యుత్ ప్రైవేటీకరణ, పెరుగుతున్న ఉద్యోగుల సమస్యలు, పెండింగ్ లో ఉన్న మూడు డిఏలు, కారుణ్య నియామకాలు, ఈపీఎఫ్ టు జిపిఎఫ్, మెడికల్ పాలసీ, ఎనర్జీ అసిస్టెంట్ ల సమస్యలు, కాంట్రాక్ట్ కార్మికుల రెగ్యులరైజేషన్ వంటి తదితర సమస్యలపై చర్చించి తీర్మానం చేయడం జరుగుతుందని వారు ఈ సందర్బంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బారావు, గిద్దలూరు వెంకట సుబ్బయ్య, రామచంద్రుడు, నాగరాజు, చెన్న క్రిష్ణ,దినేష్ రెడ్డి,ప్రశాంత్ పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.

## వేరుశెనగకాయల విత్తనాలు పంపిణీ



రామసముద్రం, జూన్ 10 ప్రభాతవార్త
మండల కేంద్రంలోని బిసి కాలనీ వద్ద ఉన్న రైతు సేవ కేంద్రంలో మంగళవారం ఎమ్మెల్యే షాజహాన్ భాష చేతుల మీదగా వేరుశెనగకాయల విత్తనాలను రైతులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్ భాష మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు సబ్సిడీ కింద అందజేసినటువంటి వేరుశెనగ కాయల విత్తనాలను రైతులందరూ సద్వినియోగం చేసుకొని తప్పకుండా వేరుశనగ పంటలను పండించి,అధిక దిగుబడులను పొందాలన్నారు. రైతులు బాగుంటే దేశం బాగుంటుందన్నారు. మరి వేరే ఇతర అవసరాలకు వాటిని ఉపయోగించకుండా వేరుశనగ పంటలు పండించాలన్నారు. ఆయా సచివాలయ పరిధిలోని వ్యవసాయ అధికారులు రైతులు వేసినటువంటి వేరుశనగ కాయల పంటలను సర్వే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు క్రిష్ణంరాజు, రాజేష్ స్వామి, మాజీ జెడ్పిటిసి శివశంకర్, రూపేష్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, పెద్దిరెడ్డి, కాంట్రాక్టర్ రెడ్డెప్పరెడ్డి, రామిరెడ్డి, శివారెడ్డి, హోటల్ నారాయణస్వామి,తిప్పన్న, ఇంజం వెంకటరమణ, రామ్మూర్తి, వెంకటేష్, సుబ్రహ్మణ్యం నాయుడు,క్రిష్ణప్ప,వాల్మీకి కిట్ట,రెడ్డప్ప, ఏవో మోహన్ కుమార్, ఏపీవో మాధవి, ఏపిఎం సాంబశివ, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి మునిస్వామి నాయక్, వ్యవసాయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సర్కారుతోపులో మహిళ ఆత్మహత్య



కురబలకోట, జూన్ 10 ప్రభాతవార్త :
కురబలకోట మండలం సర్కారుతోపులో మదనపల్లెకు చెందిన మహిళ ఉరివేసేకొని ఆత్మహత్య చేసుకొన్న సంఘటన మంగళవారం వెలుగు చూసింది. ఎస్ఐ దిలీప్‌కుమార్ వివరాల మేరకు. మదనపల్లెలోని చంద్రాకాలనీకి చెందిన లక్ష్మీదేవి(38) కురబలకోట మండలం అంగళ్ళు సమీపంలోని సర్కారుతోపు వద్ద అల్లనేరేడు చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందిందన్నారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

### బివైఎస్ రాష్ట్ర అధ్యక్షులు పునిత్

మదనపల్లె, జూన్ 10 ప్రభాతవార్త :
మదనపల్లె ఇండస్ట్రీయల్ ఏస్టేట్ నందు నియమ నిబంధనలకు విరుద్ధగా నిర్మాణాలు చేపడుతున్న భవన యజమానులపై చర్యలు తీసుకోవాలని బివైఎస్ రాష్ట్ర అధ్యక్షులు పునిత్ డిమాండ్ చేశారు. మంగళవారం సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓకు బహుజన యువసేన ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక అభివృద్ధి కోసం 36 ఎకరాల్లో ఇండస్ట్రీయల్ ఏస్టేట్ ఏర్పడిందన్నారు. వ్యవసాయాదిత పరిశ్రమలకు ఈ ఇండస్ట్రీయల్ ఏస్టేట్ ఉపయోగపడుతుందన్నారు. ఎంతోమందికి ఈ ఏస్టేట్ ఉపాధి కల్పిస్తుందన్నారు. అయితే కొందరు భవన యజమానులు నియమ నిబంధనలకు విరుద్దంగా అక్రమ నిర్మాణాలు నిర్మిస్తున్నారన్నారు. బహుళ అంతస్థుల నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేకపోయినా సెల్లార్ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ఏపిఐఐసి అధికారులకు ఈ అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇండస్ట్రీయల్ ఏస్టేట్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపైచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరిక్రిష్ణ, శ్రీనివాసులు, జిలాని, నవీన్, శశికుమార్, బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

## శ్రీ విద్యా విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 10, ప్రభాత వార్త :
స్థానిక సూపర్ బజార్ రోడ్డు లోని శ్రీ విద్యా జూనియర్ కళాశాల విద్యార్థులు ఆదివారం విడుదల చేసిన ఈఏపీసెట్ ఫలితాలలో ఉత్తమ ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ రమణారావు తెలిపారు. ఈ ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు అగ్రికల్చరల్ అండ్ ఫార్మసీ విభాగంలో సానియా 5405 ర్యాంకు, నౌస్మీన్ భాను 6533, రహముతిన్నీసా బేగం 7572, మూయిజ్ 13987, సాయి చరణ్ తేజ 15713, సబ్రిన్ 15168 ర్యాంకులు సాధించారని వివరించారు. ఇంజనీరింగ్ విభాగంలో లిఖిత 7723, నవ్య శ్రీ 11202, ఉషశ్రీ 13542 ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు శ్రీకాంత్ కుమార్ రెడ్డి, రామమోహన్, దస్తగిరి అభినందించారు.

## కన్నె మడుగు టిడిపి అధ్యక్షుడిగా సురేంద్ర.



తంబళ్లపల్లె జూన్ 10 ప్రభాతవార్త ః
మండలం కన్నె మడుగు టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కే రామిగానిపల్లికు చెందిన సురేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి తెలిపారు. మంగళవారం తంబళ్లపల్లె ఇంచార్జ్ దాసరపల్లి జయచంద్రరెడ్డి ఆదేశాల మేరకు మఠంలో జరిగిన ఎన్నికలో ఉపాధ్యక్షుడిగా భూమిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శంకర్ రెడ్డి, ఏడు మంది కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ తమ ఎన్నికకు సహకరించిన జయచంద్రారెడ్డి, రెడ్డప్ప రెడ్డి, నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతూ పంచాయతీలో టిడిపి పటిష్టతకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ రెడ్డి, బాలరాజు, వెంకటరమణ, సోమశేఖర్, మహేష్, కనకరాజు, బిజెపి నాయకుడు కేఆర్ మదన్మోహన్ రెడ్డి, పురుషోత్తం, వీరాంజనేయులు, రామ్మూర్తి నాయుడు, చిన్న రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థి మిత్ర పంపిణీకి రంగం సిద్ధం



పెద్దమండెం జూన్ 10 ప్రభాతవార్త
జూన్ 12న ప్రభుత్వ పాఠశాలలో పునః ప్రారంభం కావడంతో ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేస్తున్నట్లు ఎం ఏ ఓటు రామకృష్ణ అన్నారు మంగళవారం పాఠశాలలకు ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలు యూనిఫాంలో బ్యాగులో కిట్లను మండలంలోని అన్ని పాఠశాలలకు పంపిణీ చేయడం జరిగిందన్నారు 12న ప్రారంభం కానున్న పాఠశాలల్లో అందరి విద్యార్థులకు కిట్లను పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కిశోర వికాసం వేసవి శిక్షణ శిబిరాల ముగింపు



లక్కిరెడ్డిపల్లి జూన్ 10 ప్రభాతవార్త
మండలంలోని ప్రతి సచివాలయ పరిధిలో కిశోర వికాసం వేసవి శిక్షణ శిబిరాల ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక బాలసదనం నందు కుసోరి బాలికల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ దాది బి మాట్లాడుతూ బాల్య వివాహాల వలన కలిగే దుష్ప్రయోజనాలు వాటి నివారణ గురించి కిషోర్ బాలికలకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కిషోర్ బాలికలకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. లక్కిరెడ్డిపల్లి , మద్దిరేవుల, కోనంపేట్ సెక్టార్ పరిధిలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు సుకుమారి,ఆయేషా స్వప్న రమణమ్మ, ఎంఎస్‌కెలు, ఏఎన్ ఎంలు, ఆశా వర్కర్లు అంగన్వాడీ కార్యకర్తలు, కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

## బద్వేలు ఖాజీ 2గ మౌల్వి మహమ్మద్ రఫి

బద్వేల్ అర్బన్, జూన్ 10, ప్రభాత వార్త
బద్వేలు ఖాజీ2గా మౌల్వి మహమ్మద్ రఫిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంతో మంగళవారం పలువురు ముస్లిం పెద్దల సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం టిడిపి ఇంచార్జ్ రితేష్ రెడ్డిని కలసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా రితేష్ రెడ్డి మాట్లాడుతు బద్వేలు పట్టణంలో ముస్లిం జనాభా అధికంగా వున్న దృష్ట్యా వారి సౌకర్యార్థం అదనంగా మరొక ఖాజీ వుంటే బాగుంటుందని తెలపడంతో,ఈ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించడమైందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి కట్టుబడి వుందన్నారు.వారి అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణాధ్యక్షులు వెంగళరెడ్డి,షేక్ మహబూబ్ బాష, తెలుగుయువత కడప పార్లమెంట్ ఉపాధ్యక్షులు జహంగీర్ బాష, టిడిపి మైనారిటీ పట్టణాధ్యక్షులు ఎస్ ఎం బాష,జమాల్ వలి ( అమీర్ సాహెబ్ ), రసూల్,ఆవాజ్ నాయకులు ఎస్ ఏ సత్తార్, ఖాదర్ వలి, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.



## 20న ఉచిత సంతాన సాఫల్య శిబిరం

వేంపల్లె :జూన్ 10:(ప్రభాత వార్త)
ఈనెల 20వ తేదీన అవోపా, అవోపా మహిళా విభాగం ఆధ్వర్యంలో ఉచిత సంతాన సాఫల్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు అధ్యక్షులు బైరిశెట్టి సునీల్ కుమార్, పచ్చిపులుసు ప్రవీణ లు అన్నారు. స్థానిక వాసవి కళ్యాణ మండపంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ ఉచిత శిబిరం అందుబాటులో ఉంటుందన్నారు. కడప నగరానికి చెందిన ప్రముఖ సంతాన సాఫల్య నిపుణులు డాక్టర్ సామసుధ చే స్త్రీ లకు సంబంధించిన గైనిక్ సమస్యలకు ఉచిత వైద్య సేవలతో పాటు మందులు పంపిణీ చేయనున్నట్లు వారు వెల్లడించారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలతో పాటు వేంపల్లె చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఆటోలకు జరిమానా



కెవిపల్లి జూన్ 10 ప్రభాతవార్త:
మండలంలోని మిన్నంరెడ్డిగారి పల్లి వద్ద మంగళవారం పీలేరు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమారి పీలేరు డిపో మేనేజర్ నిర్మల బస్ స్టేషన్ మేనేజర్ బాబు నాయక్ ఆధ్వర్యంలో రికార్డులు సక్రమంగా లేని ఆటోలు మరియు అదనపులోడుతో వెళ్తున్న ఆటోలను తనిఖీ చేసి తొమ్మిది ఆటోలకు రూ.51,560 జరిమానా విధించినట్లు తెలిపారు ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ అనుమతులు లేని ఆటోలు రోడ్డుపై నడప రాదని వాహన డ్రైవర్లకు సూచనలు సలహాలు చేశారు.

## వేరుశనగను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



సబ్సిడీ వేరుశనగ విత్తనాల పంపిణీ ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్

పీలేరు జూన్ 10 ప్రభాతవార్త :
ప్రభుత్వం అందిస్తున్న రాయితీ వేరుశనగ విత్తన కాయలను ఖరీఫ్ రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామమూర్తి తెలిపారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక ఏఎంసీ కార్యాలయం ఆవరణంలో వేరుశనగ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని ఏఎంసీ పాలకమండలి, వ్యవసాయ శాఖ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ లో 40 శాతం సబ్సిడీపై వేరుశనగ విత్తన కాయలు గ్రామాల్లోనే రైతులకు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. అగ్రికల్చరల్ ఏఓ రమాదేవి మాట్లాడుతూ నారాయణి రకం వేరుశనగ కాయలు 30 కిలోల బస్తా రూ.1,710, కె6 రకం వస్తా రూ.1,674తో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మాజీ మండల అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, టిడిపి నాయకులు పోలిశెట్టి సురేంద్ర, జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కలప రవి, డైరెక్టర్లు అమర్నాథ్ రెడ్డి (పాల అమర), లక్ష్మీకాంతమ్మ, రమాదేవి, అనురాధ, వనిత, రహంతుల్లా, శివమ్మ, అగ్రికల్చర్ అధికారులు హిమబిందు, నజీర్, రైతులు, మార్కెట్ యార్డ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పీఎం సూర్యగర్‌పై అవగాహన సదస్సు

కె.వి.పల్లి, జూన్ 10 ప్రభాతవార్త:



పీలేరు మండలం, విద్యుత్ ఈ.ఈ కార్యాలయం నందు ఉదయం 11 గంటలకి మరియు కె.వి పల్లి మండలం నందు మధ్యాహ్నం నాలుగు గంటలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈ.ఈ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఈ.ఈ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సూర్య ఘర్ పథకం భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ఇంటి మీద సోలార్ ప్యానెల్లు ఏర్పాటు చేయించి విద్యుత్‌ను పొందవచ్చు. ఈ పథకం 2024లో ప్రారంభమైంది. దీని ద్వారా ప్రజలు విద్యుత్ చార్జీలను తగ్గించుకోవచ్చు. పునరుత్పాదక శక్తిని ప్రోత్సహించడం దీని ప్రధాన లక్ష్యం. దీనివల్ల పర్యావరణానికి హాని లేకుండా విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చు. ప్రభుత్వ లక్ష్యం 1 కోటి ఇంటీలకు సోలార్ ప్యానెల్లు అమర్చడం. ఈ పథకం ద్వారా ప్రజలకు సబ్సిడీ కూడా లభిస్తుంది. కేంద్ర ప్రభుత్వం నుండి నేరుగా బ్యాంక్ ఖాతాలో సబ్సిడీ జమ అవుతుంది. రాష్ట్ర విద్యుత్ సంస్థలు కనెక్షన్ ఇచ్చే బాధ్యత వహిస్తాయి. ఈ పథకం కోసం ప్రత్యేకంగా పోర్టల్‌ను ప్రారంభించారు - https://pmsuryaghar.gov.in. అర్హులైన వారు ఆ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ప్రక్రియ సులభంగా ఉంది. దీనివల్ల గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలు రెండింటికీ లాభం కలుగుతుంది. దీని వల్ల దేశంలో పునరుత్పాదక శక్తి సామర్థ్యం పెరుగుతుంది. భవిష్యత్తులో విద్యుత్ ధరలపై ఆధారపడే అవసరం తగ్గుతుంది. ఇది వ్యక్తిగత ఆదాయాన్ని పెంచడంలో కూడా సహాయపడుతుంది. సూర్య ఘర్ పథకం ఒక సుస్థిర భవిష్యత్తుకు దారితీసే అడుగు అని ఈ.ఈ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. పూర్తి వివరాల కోసం రేపు నిర్వహించబడే అవగాహన కార్యక్రమానికి హాజరై సందేహాలను అడిగి తెలుసుకోవచ్చని తెలిపారు.

## నరేంద్ర మోడీ పాలనలో దేశం అప్పుల కుప్ప

వేంపల్లె జూన్ 10 (ప్రభాత వార్త):
నరేంద్ర మోడీ 11ఏళ్ల పాలనలో దేశం అప్పుల కుప్ప అయిందని , ఏపీ కి తీరని అన్యాయం జరిగిందని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసి రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం వేంపల్లి లో విలేకరులతో మాట్లాడుతూ 1947 నుంచి 2024 వరకు 67 సంవత్సరాలలో, పండిట్ నెహ్రూ మొదలుకొని మన్మోహన్ సింగ్ వరకు 12 మంది ప్రధానుల పాలనా కాలంలో కేంద్ర ప్రభుత్వం చేసిన మొత్తం అప్పు 46 లక్షల కోట్ల రూపాయలు కాగా, 2014 నుంచి 2025 వరకు 11సంవత్సరాల పాలనా కాలంలో మోడీ ప్రభుత్వం చేసిన అదనపు అప్పు 140 లక్షల కోట్ల రూపాయలు అని ఆరోపించారు. మోడీ పాలనలో రూపాయి విలువ పాతాళానికి పడిపోయిందని మండిపడ్డారు. మోడీ 11 ఏళ్ల పాలనలో ఆంధ్ర ప్రదేశ్ కు తీరని అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రానికి సంజీవిని లాంటి ప్రత్యేక హోదా, రాయలసీమకు, ఉత్తరాంధ్రకు బుందేల్ ఖండ్ తరహా అభివృద్ధి ప్యాకేజీ అమలు కాలేదన్నారు. కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యం లో ఉక్కు కర్మాగారం, దుగరాజపట్నం ఓడ రేవు నిర్మాణం కాలేదన్నారు. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం నత్త నడకన సాగుతోందన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే మోడీ ప్రభుత్వ 11 ఏళ్ల పాలన అటు దేశానికి, ఇటు రాష్ట్రానికి చీకటి యుగమని తులసి రెడ్డి పేర్కొన్నారు.

## చౌడేశ్వరిదేవికీ ప్రత్యేక పూజలు

వేంపల్లె :జూన్ 10:(ప్రభాత వార్త)
మండలంలోని తాళ్లపల్లి గ్రామంలో ఉన్న చౌడేశ్వరిదేవికీ టిడిపి జిల్లా కార్యదర్శి జయరామిరెడ్డి, పులివెందుల సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఆలయాన్ని సందర్శించి, అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే ఆలయ అర్చకుడు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం దుగ్గన్నగారిపల్లి చెందిన టిడిపి నాయకుడు యోగానంద రెడ్డి ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరితో పాటు గంగరాజు, ధనుంజయ, జయరాం, రాజు, రవి, అశోక్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## విద్యా హక్కు చట్టాన్ని అమలుపరచాలి

వేంపల్లె :జూన్ 10:(ప్రభాత వార్త)
2025,26 విద్యా సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని జాతీయస్థాయి స్వచ్ఛంద సంస్థ కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ ప్రతినిధులు జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ ను కోరారు. ఈ మేరకు మంగళవారం కడపలో డీఈఓ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలలో 25 సీట్లు ఆర్థికంగా సామాజికంగా వెలుగబడిన వర్గాల పిల్లలకు ఉచితంగా ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం లో అమలు లోపాలు, రియంబర్స్మెంట్ జాప్యం, సమాచారం లోపం వంటి అంశాలపై వారు వివరించారు. ఈ చట్టాన్ని అమలుపరిస్తే ప్రతి పేద విద్యార్థికి ఇది ఆశాకిరణంగా నిలుస్తుంది అన్నారు. ఏడూ ముఖ్యమైన ప్రతిపాదనలతో కూడిన కార్యాచరణ ప్రణాళికలు సమర్పించారు. ఈ చర్యలు విద్యాస మానత్వానికి సాధించడంలో కీలకంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ వ్యవస్థాపక అధ్యక్షులు అనిల్ కుమార్, మిషన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, మరియు కేంద్ర కమిటీ సభ్యులు అశోక్, కడప జిల్లా అధ్యక్షులు గూడూరు రామచంద్ర, జిల్లాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతోనే తల్లి బిడ్డ క్షేమం





**బద్వేల్, జూన్ 10 ప్రభాతవార్త**

తొట్టిగారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధానమంత్రి మాతృత్వ సురక్షిత అభయాన్ డాక్టర్ జె.వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరపడమైనది. ఈ కార్యక్రమంలో బద్వేల్ ఉప జిల్లావైద్య ఆరోగ్య శాఖ అధికారి వి. మల్లేష్ పాల్గొని పౌష్టికాహారంతోనే తల్లి బిడ్డ క్షేమంగా ఉంటారని, ప్రతి గర్భిణీను ప్రతినెల తొమ్మిదో తారీఖున జరిగే ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో తీసుకొని వచ్చి సురక్షితమైనటువంటి కాన్పులు చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని, పేర్కొనడమైనది. అదేవిధంగా డాక్టర్ జె.వినయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి గర్భిణీ స్త్రీలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు రక్త పరీక్షలు వైద్య పరీక్షలు ఉచిత వైద్యము ఉచిత మందులు ఉచిత రవాణా చేయబడును, కావున ఈ కార్యక్రమం ప్రతినెల 9,10 వ తారీఖున జరుగును కావున మండలంలోని గర్భిణీలందరినీ తీసుకొని వచ్చి స్త్రీ నిపుణుల ద్వారా పరీక్షించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని పేర్కొనడమైనది, హెల్త్ ఎడ్యుకేటర్ బి వెంగయ్య మాట్లాడుతూ గర్భిణీలు పోషక ఆహారము యొక్క ప్రాముఖ్యతను గురించి, ఆరోగ్య సేవలు ప్రభుత్వము ప్రవేశపెట్టిన అటువంటి సంక్షేమ కార్యక్రమాలైన ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన ప్రోగ్రాం జననీ సురక్ష ప్రోగ్రామ్, గర్భిణీలు మరియు చిన్నపిల్లల వ్యాధి నిరోక టీకాలపై, ఐరన్ మాత్రల యొక్క ప్రాముఖ్యతను గురించి ఆరోగ్య విద్య ద్వారా అవగాహన కల్పించడం అయినది. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తొట్టి గారిపల్లి పరిధిలోని కొంగలవీడు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం సిబ్బంది లైన శుభలేఖ, లక్ష్మీదేవి మరియు సిబ్బంది గర్భిణీలు అందరికీ పౌష కాహారము అందజేయడమైనది. ఈ కార్యక్రమంలో డాక్టర్ జె వినయ్ కుమార్ మెడికల్ ఆఫీసర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తొట్టిగారిపల్లె హెల్త్ వేధికేటర్ బి వెంగయ్య కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రావతి హెల్త్ సూపర్వైజర్ కే వెంకటమ్మ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ ఏఎన్ఎమ్స్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది మరియు గర్భిణీలు పాల్గొనడం అయినది.

# రాజు విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

**రాజంపేట అర్బన్, జూన్ 10 ప్రభాతవార్త**

10వ తరగతి పరీక్షలలో ప్రతిభ కనబరిచిన నలుగు రాజంపేట రాజు హై స్కూల్ విద్యార్థులకు ప్రతిభా అవార్డులు దక్కాయి. రాజు హై స్కూల్లో విద్య అభ్యసించిన ఇండ్లూరి రెడ్డి రాహిత్య(596/600), టంగుటూరి నాగ కార్తీక్(595/600), గూడూరు నిహారిక(595/600), ఏకశిరి నవ్యశ్రీ (510/600)లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభ అవార్డులకు ఎంపికయ్యారు. ఈ అవార్డులను రాయచోటిలో నిర్వహించిన షైనింగ్ స్టార్స్ కార్యక్రమంలో కలెక్టర్ శ్రీధర్ చామకూరి అందజేశారు. ప్రశంసా పత్రం,మెడల్, నగదును విద్యార్థులకు అందజేసి కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులకు అమూల్యమైన సలహాలను సూచనలు అందజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం రాజు హై స్కూల్ సీఈవో గుంటి మడుగు రఘురామరాజు, ప్రిన్సిపాల్ వాయల్పాటి మోహన్ రెడ్డి ప్రతిభా అవార్డులు సాధించిన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యలో రాణించేందుకు అహర్నిశలు కృషి



ప్రతిభ అవార్డుల ప్రధానంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

చేయాలన్నారు. పోటీ పరీక్షలలో ప్రతిభ కనబరచాలన్నారు. ఇష్టంతో చదివి విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు.రాజు హైస్కూల్లో క్రమశిక్షణతో కూడిన విద్యను అందించనున్నట్లు తెలియజేశారు. ప్రతి విద్యార్థి మంచి భవిష్యత్తుకు విద్యార్థి దశలోనే మంచి పునాదులు వేసు కోవాలన్నారు.

# బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం



**కె.వి పల్లి జూన్ 10 ప్రభాతవార్త :**

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా, ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా జూన్ 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు ప్రత్యేక తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఈరోజు (జూన్ 10, 2025) కంభం వారి పల్లి మండలకేంద్రం గర్ని మిట్ట లో పలు దుకాణాలు వెల్డింగ్ షాపులు మరియు చికెన్ సెంటర్లు పలు ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ సిబ్బందితోపాటు, గ్రేట్ విజన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం బాబు. విద్య, వైద్య, పోలీసు, శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో ఈ కార్యాచరణను నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం రెడ్డి,వైద్య శాఖ సిబ్బంది పురుషోత్తం,వెంకటరత్న, పోలీసు సిబ్బంది రమేష్ బాబు, వెంకటరమణ, శిశు సంక్షేమ శాఖ సూపర్వైజర్ అన్నపూర్ణ మండల్ లీగల్ సర్వీస్ అథారిటీ పారా లీగల్ వాలంటీర్ గట్టప్ప తో పాటు రెడ్స్ సిబ్బంది వెంకటయ్య మరియు వర్తక వ్యాపారస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో గ్రామదేవత గంగ జాతర



**పీలేరు జూన్ 10 ప్రభాతవార్త:**

పీలేరు గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ రౌద్రాల అంకాలమ్మ గంగమ్మ తల్లి గంగ జాతరలో భాగంగా ఐదు వారాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో చివరివారమైన మంగళవారం ఉదయాన్నే అభిషేకాలు పూజలు అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు వితరణ కావించారు సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై అమ్మవారిఉత్సవ విగ్రహాన్ని పీలేరు పట్టణ పురవీధుల్లో మేళ తాళాలు డప్పు వాయిద్యాలు భాజా భజంత్రీలు చెక్కభజనలు పిల్లనుగ్రోలు అశేష భక్త జన సందోహం మధ్య అమ్మవారి ఊరేగింపు అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగింది. ఉదయం చివరి మంగళవారం కావడంతో వివిధ వేషధారణలతో భక్తులు అమ్మవారికి దిలు బాణాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ దేవత మహిమలు కలిగిన గంగమ్మ తల్లి ఆలయానికి భక్తులు పోటెత్తారు ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలి



**రాజంపేట అర్బన్, జూన్ 10 ప్రభాతవార్త**

సంబేపల్లి మండలం నాగిరెడ్డిగారి పంచాయతీ పరిధిలోని బండకాడపల్లి గ్రామంలో పర్యావరణాన్ని పరిరక్షించేందుకు చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కుమారుడు టిడిపి యువ నాయకులు నిశ్చల్ నాగిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ నాశనం భవిష్యత్ తరాలకు ముప్పుగా మారుతున్న నేపథ్యంలో అందరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి ఇంటి వద్ద కనీసం ఒక్క మొక్కను నాటి పెంచాలన్న సంకల్పంతో కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం యువత ముందుకు రావాలని నిశ్చల్ నాగిరెడ్డి పిలుపునిచ్చారు.

# నిత్యావసర వస్తువులు పంపిణీ.




**ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 10 ప్రభాతవార్త :**

ప్రొద్దుటూరు నందు గల శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమమునకు ఆర్ కే హెల్పింగ్ హాండ్స్ కువైట్ వారి సహకారంతో మీకోసం సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇరవై వేల రూపాయల విలువచేసే నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ ప్రముఖ రచయిత జింకా సుబ్రమణ్యం మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవగా భావించి ఆర్కే హెల్పింగ్ హాండ్స్ కువైట్ వారు కొంతమంది వ్యక్తులతో సమూహంగా ఏర్పడి జీవనోపాధి కోసం కువైట్ తదితర విదేశాలకు వెళ్లి జీవనం సాగిస్తూ, వచ్చిన ఆదాయంలో కొంత భాగం రాష్ట్రంలోని 11 ఆశ్రమాలకు, అందులో కడప జిల్లాలో 5 ఆశ్రమాలకు సహాయం చేస్తున్నారని, వాళ్ళు కష్ట పడిన డబ్బును ఇలా సేవా కార్యక్రమాలకు పుణ్య కార్యక్రమాలకు వెచ్చిస్తూ ఎంతోమంది నిరాశ్రయులను అభాగ్యులను ఆదుకుంటూ ఎన్నో అనాధాశ్రమాలకు మరియు విద్యార్థులకు సంబంధించిన ఇలాంటి ఆశ నిలయాలకు నిత్యవసర సరుకులు ఇస్తూ సమాజంలో వారి వంతు పాత్ర పోషిస్తూ ఇలాంటి కార్యక్రమాలకు నాంది పలకడం శుభ పరిణామం అని ఇలాంటి వ్యక్తులను సంస్థలను ఆదరించడం గౌరవించడం ప్రోత్సహించడం ఎంతైనా అవసరమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక ప్రవచనకర్త శివ యోగేంద్ర , మీకోసం సేవా సంస్థ అధ్యక్షుడు విష్ణు వర్ధన్, మదర్ థెరిస్సా వృద్ధాశ్రమం నిర్వాహకులు కంచన రాజేష్,ఆశ్రమ నిర్వాహకులు సుబ్బారాయుడు పాల్గొన్నారు.

# కిశోర వికాసం సదస్సులో అవగాహన,

**మైదుకూరు, జూన్ 10, ప్రభాతవార్త:**

కిశోర వికాసం కార్యక్రమమునకు సంబంధించి మే నెల 3 వ తేదీ నుండి జూన్ నెల 10వ తేదీ వరకు కిశోర వికాసం వేసవి సెలవుల కార్యక్రమంలో భాగంగా జీవి సత్రం, సచివాలయం నందు కిశోర వికాసం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. కిశోర వికాసం అవగాహన సదస్సులో ఆరోగ్యం, విద్య, బాల్య వివాహాల, కిశోర వికాస, తల్లిదండ్రుల పాత్ర, కిశోర బాలికలకు రక్తహీనత, ఋతుస్రావం, చిన్న వయసులో పెళ్లిళ్ల, జరిగే వచ్చు లాభ నష్టాల గురించి ఈ సమావేశంలో కిశోర బాలికలకు అవగాహన కల్పించడం జరిగినది. సమావేశంలో సిడిపిఓ శ్రీదేవి, సూపర్వైజర్స్ శ్రీదేవి, ఏఎన్ఎం, నాగమణి, సౌజన్య, గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, అంగన్వాడి, ఆశా వర్కర్లు, కార్యకర్తలు, పిల్లల తల్లులు, కిశోర బాలికలు పాల్గొనడం జరిగింది.



# భీమేశ్వరస్వామి దర్శించుకున్న భక్తులు

**పెండ్లిమర్రి, జూన్ 10, ప్రభాతవార్త:**



మండలంలోని ఏలూరుపాడు గ్రామ సమీపంలో వెలసిన భీమేశ్వరస్వామి తిరునాళ్ల వైభవంగా జరిగింది. మంగళవారం, బుధవారం తిరునాళ్ల జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా ఆలయ కమిటీ వారు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు. బుధవారం బండలాగుడు పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

# బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం



**సిద్దవటం జూన్ 10 ప్రభాత వార్త:**

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని మహిళా పోలీస్ సాయి మానస ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలోని గొల్లపల్లి అంగన్వాడీ పాఠశాలలో మరియు సిద్దవటం అంగన్వాడి పాఠశాల నందు మంగళవారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధ చట్టం (పిసిఎంఏ) 2006 చట్టం ప్రకారం మహిళలకు కనీస వివాహ వయస్సు 18 ఏళ్లు కాగా, పురుషులకు 21 ఏళ్లు ఉండాలన్నారు. ఈ చట్టం బాల్య వివాహాలకు 2 సంవత్సరాల వరకు జైలు శిక్ష లేదా రూ. 1 లక్ష వరకు జరిమానా లేదా రెండూ విధించవచ్చునన్నారు. బాల్య వివాహాలు జరిపిన లేదా నిర్వహించే వారికి కూడా శిక్ష వర్తిస్తుందన్నారు. అంగన్వాడీ సూపర్వైజర్ వరలక్ష్మి మాట్లాడుతూ చిన్న వయస్సులోనే వివాహాలు జరగడం వల్ల ఆడ పిల్లలు అనారోగ్యం పాలవుతారన్నారు. చిన్న వయస్సులోనే లైంగిక సంపర్కంతో బాటు, గర్భవతులు కావడం, దీనితో బాటు హెచ్.ఐ.వి, రక్త హీనత సోకడానికీ, భగంధరమనే వ్యాధిరావడానికి ( సన్నని నాళంలా వ్యాపించే కురుపు) అవకాశం ఎక్కువ ఉందన్నారు. ఈ బాలికలకు హోదా, శక్తి, పరిణతి లేకపోవడం వలన గృహ హింసకు, లైంగిక వేధింపులకు, సామాజికంగా విడిగా ఉండడం వంటి పరిస్థితులకు గురౌతారన్నారు. బాల్య వివాహాల వలన చాలా మటుకు వారి చదువు ఆగిపోవడం, లేదా అర్థవంతమైన పనిలేకపోవడం వలన పేదరికాన్ని అనుభవించవలసి వస్తుందన్నారు. బాల్య వివాహం లింగ వివక్ష, జబ్బులు, బీదరికమనే క్లిష్టమైన విష వలయంగా నిర్లక్ష్యానికి లోనౌతారన్నారు. లేత వయస్సులో వివాహాలు జరగడం వల్ల కాన్పు కష్టం కావటం వల్ల ప్రసూతి మరణాలు, శిశు మరణాలు అధిక శాతంలో సంభవిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్, వరలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ నాగరత్నమ్మ, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# మదనపల్లె విద్యార్థినికి ప్రశంసాపత్రం




**మదనపల్లె, జూన్ 10 ప్రభాతవార్త :**

రాష్ట్ర మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మణప్రసాద్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌లు మదనపల్లె విద్యార్థిని ఆర్ తేశ్వనికి నగదు పురస్కారాన్ని అందజేశారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో తేజశ్వని 1000మార్కులకు గానూ 989మార్కులు సాధించడం పట్ల షైనింగ్ స్టార్ అవార్డుల కార్యక్రమంలో భాగంగా మంత్రి సోదరుడు, కలెక్టర్ ప్రశంసాపురస్కారాన్ని అందజేశారు. నగదు ప్రోత్సాహకంలో భాగంగా రూ.20వేలు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా డిఐఈఓ రవి, డిఈఓ సుబ్రమణ్యం, చైతన్య జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌బాబు, అధ్యాపకులు తోటి విద్యార్థులు తేజశ్వనిని అభినందించారు.

# సమస్యలపై వైఎస్ షర్మిలరెడ్డికి వినతి



**వీరబల్లి, జూన్10, ప్రభాత వార్త:**

అన్నమయ్య జిల్లాలోని రాజంపేట నియోజకవర్గంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు గురించి రాయచోటి పిసిఆర్ ఫంక్షన్ హాల్లో జరిగిన కార్యకర్తల సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను కలిసి విఆర్డిఎస్ సురేంద్రారెడ్డి వినతిపత్రం అందచేశారు.ఈ సందర్భంగా సురేంద్రారెడ్డి మాట్లాడుతు రాజంపేట నియోజకవర్గ వ్యాప్తంగా గత ఐదేళ్లుగా ఏళ్లుగా మామిడి, అరటి పంటలు సరిగా పండక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం నుంచి రైతులకు ఎలాంటి సహాయం అందలేదని, అలాగే గత వరదల్లో కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్ట్ మరమ్మత్తులకు నోచుకోలేదని, త్రాగునీటి సమస్యలు, నిలిచిపోయిన రోడ్ల మరమ్మత్తులపై, రైతులకు మండలానికి ఒక కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం, మామిడి, టమోట, అరటి పంట పండించే రైతన్నలకు గిట్టుబాటు ధర కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అనంతరం షర్మిలమ్మను సురేంద్రారెడ్డి శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శివరాజు,శ్రీహరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాదరణ లేకనే ఓటమిపాలయ్యావు

**రాజంపేట అర్బన్, జూన్ 10 ప్రభాతవార్త**



నాలుగు సార్లు ఎమ్మెల్యే గా గెలిచిన శ్రీకాంత్ రెడ్డి 2024 ఎన్నికల్లో ప్రజాదరణ లేకనే ఓటమి పాలయ్యారని మాజీ జెడ్పిటిసి మల్లు నర్సారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగాసంబేపల్లి లో విలేకరులతో నరసారెడ్డి మాట్లాడుతూ ఈవీఎంల మోసం తోనే తాము ఓటమి పాలయ్యామని చెప్పుకోవడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. 2010 ఉప ఎన్నికల నుండి 2014, 2019 ఎన్నికల్లో వచ్చిన ఓట్ల మెజార్టీ తగ్గుతూ వచ్చిందన్నారు. సంబేపల్లి మండలంలో 2014 ఎన్నికల్లో దాదాపు తొమ్మిది వేలు మెజార్టీ రాగా 2019 ఎన్నికల్లో 4000 కు పడిపోయింది అన్నారు. 2024 ఎన్నికల్లో టిడిపికి 2500 ఓట్ల మెజార్టీ వచ్చింది అంటే నీ పనితీరు ఎలా ఉందో దీనిని బట్టి అర్థమవుతుందన్నారు. రాయచోటి నియోజకవర్గం లో 15 సంవత్సరాలు ఎమ్మెల్యేగా కొనసాగిన నీవు ప్రజలకు పనికొచ్చే ఒక్క మంచి పని చేసినట్టు నిరూపించగలరా అని మండిపడ్డారు. మా యువ నాయకుడు రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి ప్రజలలోకి చొచ్చుకొని పోయి నియోజకవర్గ అభివృద్ధి కొరకు కృషి చేస్తున్నారన్నారు. మీకు అది నచ్చకే పిచ్చి పట్టి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. మా మంత్రిని మాట్లాడే నైతిక హక్కు మీరు ఓటమిపాలైనప్పుడే కోల్పోయారన్నారు. 2024 ఎన్నికల్లో జగన్ పాలనపై ప్రజలు విసుగు చెంది కూటమి ప్రభుత్వానికి 164 సీట్లు ఇస్తే ట్యాంపరింగ్ అని పిచ్చి పట్టిన వారిలా మాట్లాడడం సరికాదన్నారు. మీరు ప్రజలకు మేలు చేసి ఉంటే 151 సీట్ల నుండి 175 కు పెరిగేవి అన్నారు. రాయచోటి ప్రజలకు మీరు మేలు చేయలేదు కాబట్టే మెజారిటీ తగ్గుతూ వచ్చి 2024 ఎన్నికల్లో ఓటమిపాలయ్యారన్నారు. నీ సొంత ఊర్లోనే గత ఎన్నికలకు ఈ ఎన్నికలకు మెజారిటీ తేడా చూస్తే అర్థమవుతుందన్నారు 80,000 నుంచి 32 వేలకుఎలా పడిపోయావు దాని అర్థం తెలుగుదేశం ఓటు బ్యాంకుతో పాటు నీ వ్యతిరేక ఓట్లు పెరగడం కారణం కాదా అన్నారు. ఒక సంవత్సరం తర్వాత నీ ఓటమి గురించి బయటకు వచ్చి మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా ఓటమిని అంగీకరిస్తే హుందాగా ఉండేదన్నారు. రాయచోటి నియోజకవర్గానికి 15 సంవత్సరాల కాలంలో ఒక ప్రాజెక్టు తీసుకు రాలేదని అందుకే ప్రజలు నీకు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పారన్నారు. రాజకీయ అజ్ఞానిలా మాట్లాడడం మానుకొని నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని సూచించారు.

# నిరుపయోగంగా వ్యాయామ పరికరాలు



**బద్వేల్ అర్బన్ జూన్ 10 ప్రభాతవార్త**

భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య బద్వేలు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పర్యటించి నిరుపయోగంగా ఉన్న వ్యాయామ పరికరాలను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ 2014లో అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పట్టణ ప్రజల ఆరోగ్య రక్షణ కోసం లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసి బద్వేలు మున్సిపాలిటీ కేటాయించిన బహిరంగ వ్యాయామ పరికరాలను ప్రజా వినియోగంలోకి తీసుకురావడంలో స్థానిక మున్సిపల్ అధికారులు పాలకవర్గాలు పూర్తిగా వైఫల్యం చెందాయని, వ్యాయామ పరికరాలను సరైన ప్రదేశంలో ఏర్పాటు చేయకుండా మూలనపడేయడంతో అవి తుప్పుబట్టి పోయాయని, కేంద్ర ప్రభుత్వ పిలుపుమేరకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలు శారీరకంగా, మానసికంగా ఉత్తేజంగా ఉండుటకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమం బద్వేలు మున్సిపాలిటీలో ప్రచార ఆర్భాటాలకే పరిమితమైందని విమర్శించారు. నిజంగా ప్రజా ఆరోగ్యం పై చిత్తశుద్ధి ఉంటే మున్సిపాలిటీలో నిరుపయోగంగా ఉన్న బహిరంగ వ్యాయామ పరికరాలను ప్రజా వినియోగంలోకి తీసుకురావడంలో తగిన శ్రద్ధ చూపాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు షేక్ మస్తాన్ షరీఫ్, షేక్ ఆదిల్, ఉపాధ్యక్షులు యస్.ప్రవీణ్ కుమార్, యువరాజు, సహాయ కార్యదర్శి నరసింహ నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**ఎమ్మెల్యే షాజహాన్‌బాషా**



వేరుశెనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**మదనపల్లె, జూన్ 10 ప్రభాతవార్త :**

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. మంగళవారం పట్టణంలోని మిషన్‌కాంపౌండ్ వద్ద ఉన్న వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులకు ఎమ్మెల్యే వేరుశెనగ విత్తన కాయలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఖరీఫ్‌సీజన్‌లో వేరుశెనగ సాగు చేసేందుకు ప్రభుత్వం సబ్సిడీ విధానంలో విత్తనాలను సరఫరా చేసిందన్నారు. ప్రతి రైతు వేరుశెనగ విత్తనాలను తీసుకొని సాగు చేయాలన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్దతిలో సాగుచేసి అధిక దిగుబడులు పొందాలన్నారు. అనంతరం రూరల్ మండలంలోని పెంచుపాడులోని రైతు సేవా కేంద్రంలో ఎమ్మెల్యే వేరుశెనగ విత్తనాలు పంపిణీ చేశారు. అదే విధంగా రామసముద్రం, నిమ్మనపల్లె మండలాల్లో కూడా రైతులకు ఎమ్మెల్యే వేరుశెనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శివశంకర్, ఏఓ నాగప్రసాద్, రైతుసేవాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం హిందూపురం ఎమ్మెల్యే బాలక్రిష్ణ జన్మదినం సందర్భంగా మార్కెట్‌యార్డు అన్నక్యాంటిన్ వద్ద కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం అభిమానులకు అన్నదానం చేశారు. తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్‌జె. వెంకటేష్, నాయకులు ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, మోడెం సిద్దప్ప, నీలకంఠ, పఠాన్‌ఖాదర్‌ఖాన్, షంషీర్, రఘుపతినాయుడు, జేసిబి మధు, వేణు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ముగిసిన నాగారపమ్మ తల్లి జాతర

**సుండుపల్లె, జూన్ 10, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని పెద్దినేని కాలువ గ్రామపంచాయతీ బండకాడ ఈడిగ పల్లె గ్రామంలో వెలసిన నాగారపమ్మ తల్లి జాతర మంగళవారం తో ముగిసింది. ఈ సందర్భంగా జిల్లాలోని భక్తులతోపాటు మండలంలోని పలు గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని మూలవిరాట్ కు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మొక్కులు తీర్చుకొని ముడుపులు చెల్లించారు. చాందిని బండ్లు, చెక్కభజనలు, కోలాటాలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా సుండుపల్లె ఎస్సై ముత్యాల శ్రీనివాసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.





**రిపోర్టర్స్ కావలెను**

తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొందిన పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

**కావలసిన సెంటర్లు**

**అన్నమయ్య జిల్లా**

నందలూరు, ఓబులవారిపల్లె,
రైల్వేకోడూరు, రాయచోటి అర్బన్

**కడప జిల్లా**

మైదుకూరు అర్బన్, జమ్మలమడుగు అర్బన్,
మైలవరం, సికెదిన్నె, కొండాపురం

ఇంటర్వ్యూ తేదీలు : 09.06.2025 నుండి 15.06.2025 వరకు మీ పూర్తి బయోడేటాతో ఈ క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

వార్త కార్యాలయం, డోర్ నెం. 1-2237, హౌసింగ్ బోర్డు కాలని, విశ్వేశ్వరయ్య సర్కిల్ దగ్గర, రైల్వేస్టేషన్ రోడ్డు, కడప.

సెల్ నెం. 9848787289, 8919566086